క్లుప్తంగా

పీహెచ్‌సీల్లో దంత వైద్యులను నియమించాలి

కాజులూరు: మండల గ్రామాల్లోని పాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్యులను నియమించాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చాక విద్యా, వైద్యాలయాలు ఎంతగానో పురోగతి సాధించాయన్నారు. అయితే ప్రజల్లో ఇటీవల దంత సమస్యలు అధికమయ్యాయని పీహెచ్‌సీలలో వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీలలో ఎదో ఒక చోటైనా ప్రభుత్వం దంత వైద్యులను నియమించాలని కోరారు.

దాతల కృషి ప్రశంసనీయం

కపిలేశ్వరపురం: ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు చాటుతున్న ఔదార్యం ప్రశంసించతగినదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంగర పీహెచ్‌సీకి అనకాపల్లి జిల్లా కేశవరంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3 లక్షలు విలువైన ప్రసూతి చికిత్స సామగ్రిని సమకూర్చింది. వాటిని అమర్చిన ప్రసూతి చికిత్స గదిని బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. వైద్యాధికారి పి.రత్నకుమారి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కవల శ్రీను, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సంస్థ కృషిని కొనియాడారు.

నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని దంగేరు, అముజూరు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. దంగేరు గ్రామానికి చెందిన మోర్త కావమ్మ, అముజూరు గ్రామానికి చెందిన పాము సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు.ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పోలిశెట్టి చంద్రశేకర్ పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ తరపున నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సంపత్, పొలిశెట్టి శ్రీను, గుబ్బల శ్రీనివాస్, ముంగి రమేష్, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట: స్థానిక టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్లు కొమ్మలు తొలగింపు పనులు దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఏడీఈ జి.తిరుమలరావు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పట్టణంలోని కృష్ణకల్యాణి నగర్, ఆలమూరు రోడ్డు, వల్లూరి వారి వీధి, రావులపేట, ధర్మగుండం చెరువు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పట్టణంలో స్వచ్ఛ మార్షల్ ర్యాలీ

రామచంద్రపురం: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను బాధ్యతగా తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ్ ఉత్సవ్ 2023లో భాగంగా స్వచ్ఛతా అవార్డులకు ఎంపికైన ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులతో కలిసి పట్టణంలో స్వచ్ఛ మార్షల్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో జరిగిన ఈ ర్యాలీలో స్వచ్ఛతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ర్యాలీలో నినాదాలు చేశారు. రాజగోపాల్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీ అనంతరం మానవహారంగా ఏర్పడిని ప్రతిజ్ఞ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, మెప్మా సీవో ఇంత రామ్‌జీ, సచివాలయ శానిటరీ సెక్రటరీలో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

రామచంద్రపురం: పట్టణంలోని శ్రీమతి ఇందిరా గాంధీ మున్సిపల్ హైస్కూల్(చాకలిపేట హైస్కూల్)లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 91 మందికి పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయిని మోర్త ఈవ ప్రసన్నకుమారి బుధవారం పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, చాక్‌మర్లు, స్కేళ్లు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్‌తోనే రాష్ట్రంలో రాజకీయ చైతన్యం

కాజులూరు: టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుతోనే రాష్ట్రంలో రాజకీయ చైతన్యం ప్రారంభమైందని తెలుగు దేశం పార్టీ రాష్ట బీసీసెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు లీలాశంకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించి ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా 1983 నుంచి పార్టీకి విశేష సేవలందిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఘనంగా సన్మానించారు.

మండపేట: టీడీపీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే వేగుళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించి టీడీపీ జెండాను ఆవిష్కరించారు.

కె.గంగవరం: మండలకేంద్రమైన కె.గంగవరం, కుందూరు, పాణింగపల్లి గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్ జెండా ఆవిష్కరించి, మాజీ సీఎం రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పానకం.. ప్రీతికరం

- శ్రీరామునికి ఇష్టమైన నైవేద్యం పానకం, వడపప్పు
- అది జనుల ఆరోగ్యానికి ఎంతో మేలు


అర్తమూరులో శ్రీరామనవమి ఉత్సవాల్లో చిన్నారులకు పానకం వేస్తున్న దృశ్యం (ఫైల్)

మండపేట: శ్రీరామ నవమి వేడుకలకు తెలుగు లోగిళ్లు పెట్టింది పేరు. చలువ పందిళ్లు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో కులాలు, జాతులకు అతీతంగా అందరూ ఆదర్శ దంపతుల దివ్యకల్యాణాన్ని వాడవాడలా ఎంతో వేడుకగా జరుపుకొంటారు. కమనీయంగా సాగే సీతారాముల కల్యాణ వేడుకలో బెల్లం పానకం, వడపప్పు నైవేద్యంగా సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ప్రసాదం తీసుకునేందుకు చిన్నా పెద్దా ఎంతో ఆసక్తి చూపుతారు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన ఈ ప్రసాదం వెనుక ఆయుర్వేద పరమార్థం ఉందని పెద్దలు చెబుతుంటారు. శ్రీరామనవమి వేసవి ప్రారంభంలో వస్తుంది. కాలాల మార్పుతో వైరల్ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. బెల్లం, మిరియాలు, యాలకులతో తయారు చేసిన పానకంలో ఐరెన్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్స్ సీ పుష్కలంగా ఉంటాయి. ఈ సీజన్‌లో వచ్చే గొంతు సంబంధిత వ్యాధులకు ఉపశమనం కలిగిస్తాయని పెద్దలు చెబుతుంటారు. అలాగే వడపప్పు తయారీకి ఉపయోగించే పెసరపప్పు శరీరంలోని ఉష్ణాన్ని తగ్గించి, చలవ చేస్తుంది. వడదెబ్బకు గురి కాకుండా కాపాడుతుంది. కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. నవమి సందర్భంగా ఉపవాసంలో ఉన్న వారికి ఈ పానకం, వడపప్పు శరీరానికి అలసటను తీర్చి ఉత్తేజాన్ని ఇస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

పెళ్లిళ్లలో మారుతున్న ట్రెండ్

హిందూ వివాహ వేడుకలో ఎదురింపు సన్నాహాలు సందర్భంగా పానకాల కావిడితో వియ్యాల వారికి స్వాగతం పలకడం ఆనవాయితీ. ఈ సాంప్రదాయం శ్రీరామ నవమి వేడుకల నుంచే పుట్టిందని పెద్దలు చెబుతుంటారు. పూర్వం అతిథులకు పానకం ఇచ్చేవారు. తర్వాత పానకం స్థానంలో కొన్నాళ్ల పాటు రస్నా నీళ్లు వచ్చి చేరాయి. ప్రస్తుత తరం వెల్‌కం డ్రింక్‌గా పిలుస్తున్నారు. మారుతున్న కాలాన్ని బట్టి ఈ వెల్‌కం డ్రింక్ మారుతూ వస్తోంది. ఇప్పుడు జ్యూస్‌లు, మాక్‌టైల్స్, రకరకాల పేర్లతో రకరకాల వెరైటీల్లో వేడుకకు హాజరైన బంధుమిత్రులకు ప్రయాణ అలసట నుంచి సేదతీరుస్తున్నాయి. నేటి వివాహ తంతుల్లో ఎన్ని శీతల పానియాలు వచ్చి చేరినా శ్రీసీతారామచంద్రుల కల్యాణ వేడుకలో పానకమే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

రాముని సుగుణాలకు ప్రతీక పానకం



రామనామం ఎంతో మధురంగా ఉంటుంది. శ్రీరామచంద్రమూర్తి వారి దివ్య స్వరూపానికి, సుగుణాలకు ప్రతీకగా తీయనైనటువంటి పానకం, కమ్మనైన వడపప్పు పెట్టడం ఆనవాయితీ. ఇవి వంటికి ఎంతో చలువ చేస్తాయి.

–మరంగంటి వరదాచార్యులు, ప్రధాన అర్చకులు, శ్రీసీతారామక్షేత్రం, మండపేట

శరీరానికి మంచిది



కాలాల మార్పు సమయంలో శరీరం ఒడిదొడుకులకు లోనై రోగనిరోధక శక్తి తగ్గుతుంది. వేసవి ప్రారంభంలో వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వీటిని శరీరం తట్టుకునేలా రోగనిరోధక శక్తిని పెంచేందుకు పానకం, వడపప్పు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

– ద్విభాష్యం శేషసత్యనారాయణ, శ్రీచింతలూరు ఆయుర్వేద ఫార్మసీ ఎండీ

అభివృద్ధికి అడ్డుపడుతుందెవరు?

- ప్రతిపక్ష సభ్యులను ప్రశ్నించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సీడీఎంఏకు ఎమ్మెల్యే వేగుళ్ల ఫిర్యాదుపై మండిపాటు
- టిడ్కో ప్లాట్ల వద్ద అభివృది పనులకు కౌన్సిల్ ఆమోదం


ఎమ్మెల్యే వేగుళ్ల ఫిర్యాదును చదివి వినిపిస్తున్న కమిషనర్ రామ్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్సీ తోట


సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: అభివృద్ధి పనులకు ఎవరడ్డుపడుతున్నారో మీరే చెప్పాలని ప్రతిపక్ష సభ్యులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. బీటీ రోడ్డును ప్రజావసరాల కోసం సీసీ రోడ్డుగా మార్పు చేస్తే దానిపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సీడీఎంఏకు ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన బుధవారం స్థానిక కౌన్సిల్ హాలులో జరిగింది. ఎక్స్‌ఆఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ తోట హాజరయ్యారు. అజెండాలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు నుంచి బైపాస్ రోడ్డు వరకూ రూ.1.10 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు అంశంపై చోటుచేసుకున్న పరిణామాలను ఎమ్మెల్సీ తోట వివరించారు. గతంలో బీటీ రోడ్డుగా చేసిన ప్రతిపాదనను స్థానికుల విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు గతంలో కౌన్సిల్‌కు తీసుకురాగా ఎమ్మెల్యే వేగుళ్ల, ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకిస్తూ మౌఖికంగా డిసెంట్ చెప్పారన్నారు. 24 గంటల్లో డిసెంట్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాల్సి ఉండగా ప్రతిపక్ష సభ్యులు ఆ పని చేయలేదన్నారు. కాగా ఎమ్మెల్యే వేగుళ్ల డిసెంట్ చెప్పిన విషయమై సీడీఎంఏకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదులోని అంశాలను మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ద్వారా సభ్యులందరికీ చదివి వినిపించారు. తెర వెనుక అభివృద్ధికి ఎవరు అడ్డం పడుతున్నారో చెప్పాలని ప్రతిపక్ష సభ్యులను నిలదీశారు. ఎమ్మెల్యే వేగుళ్ల లేని సమయంలో ఆరోపణలు తగదని ప్రతిపక్ష సభ్యులు అనగా అజెండాలో అంశం వచ్చినందున తెర వెనుక ఆయన చేస్తున్న పనులు తెలిపేందుకు తాను మాట్లాడానని ఎమ్మెల్సీ తోట స్పష్టం చేశారు. ఒక మంచి పని జరుగుతుంటే భరించలేక ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఫిర్యాదును కౌన్సిల్‌లో చదివి వినిపించమన్నానని ఎమ్మెల్సీ తోట తెలిపారు.

ఎక్స్ ఆఫీసియో సభ్యుడిగా ఎమ్మెల్సీ తోట

కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట కౌన్సిల్ సమావేశాలకు హాజరుకావడంపై గతంలో ఎన్నో మార్లు టీడీపీ సభ్యులు ఫిర్యాదులు చేశారని విమర్శించారు. ఈ విషయమై కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ మండపేట మున్సిపాలిటీతో పాటు కాకినాడ కార్పొరేషన్‌లోను ఎమ్మెల్సీ తోటకు ఎక్స్‌ఆఫీషీ యో సభ్యుని హోదా కల్పిస్తూ ఉన్నత స్థాయి నుంచి తమకు ఆదేశాలు అందాయన్నారు. రెండుచోట్ల సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు పూర్తి అధికారం ఉందని స్పష్టం చేశారు.

టిడ్కో ప్లాట్ల వద్ద అభివృద్ధి పనులకు ఆమోదం

టిడ్కో ప్లాట్ల వద్ద నివాసితులు దుస్తులు ఉతుక్కునేందుకు, ఇతర అవసరాల కోసం రూ.30 లక్షలతో బోర్ల ఏర్పాటుకు, రాత్రి వేళల్లో ప్లాట్ల వద్ద పాముల బెడద లేకుండా ప్లాట్ల పైభాగంలో రూ.14.5 లక్షలతో ఫోకస్ లైట్లు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. త్వరితగతిన ఆయా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్సీ తోట కమిషనర్ రామ్‌కుమార్‌ను ఆదేశించారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

పారిశుధ్య నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలి



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ రామ్‌కుమార్ తదితరులు

మండపేట: పట్టణ పారిశుధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పిలుపునిచ్చారు. స్వచ్ఛత మాషాల్ మార్చ్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు, సామాజిక కార్యకర్తలు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, మేనేజర్ కనకరాజు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మెప్మా టీఈ అనంతలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్కాగా సామాజిక తనిఖీలు


ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

రాయవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు(సోషల్ ఆడిట్) పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్టు డ్వామా పీడీ ఎస్.మధుసూదరావు తెలిపారు. బుధవారం రాయవరంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలు, అక్రమాలపై రాత పూర్వక ఫిర్యాదులు అందితే విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రజావేదికలో ఎవెన్యూ ప్లాంటేషన్ చేసిన ప్రదేశంలో పని వివరాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై వీటికి మంజూరైన రూ.59,758 సీఆర్‌డీ ఖాతాకు జమ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మండలంలోని కురకాళ్లపల్లిలో చేపట్టిన బోది కాలువ కొలతలకు సంబంధించి గుర్తించిన తేడాలు, రూ.65 వేలు నగదు చెల్లింపులకు గాను సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్ కరుణాకర్‌పై ఏపీడీతో విచారణ జరిపించాలని అధికారులు ఆదేశించారు. ఉపాధి కూలీలకు గుర్తింపు కార్డులకు రూ.58 వసూలపై నిర్లక్ష్యం వహించిన ఏపీవో సుధారాణి, ఏఈ ఈశ్వరరావులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని వెంటూరు, కూర్మాపురంలో కూలీల మస్టర్ల విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న ఇద్దరు మేట్లను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ ప్రజావేదికలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ, ఏపీడీ కె.సత్యనారాయణ, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఏపీఓ జె.సుధారాణి, జేఈ ఈశ్వరరావు, ఇంచార్జ్ ఈఓపీఆర్డీ గోవిందరాజులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

రాయవరం: ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 38 పరీక్షా కేంద్రాల్లో 28,973 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలి. కొంత మంది గైర్హాజరయ్యారు. బుధవారం ఇంటర్ సెంకడ్ ఇయర్ విద్యార్థులకు జరిగిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షతో ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పరీక్షలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 11,504 మంది హాజరుకావాల్సి ఉండగా 11,124 మంది రాశారు. 380 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ పరీక్షకు 1233 మంది హాజరుకావాల్సి ఉండగా 1,103 మంది విద్యార్థులు హాజరు కాగా 130 మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 31, ఏప్రిల్ 1, 3, 4వ తేదీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఒకేషనల్ బ్రిడ్జ్ పరీక్షలు జరగనున్నాయి.

వ్యక్తిపై దాడి

రామచంద్రపురం రూరల్: తన భర్తపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ వెల్ల గ్రామానికి చెందిన కొండేపూడి భవాని ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. భవాని భర్త రాజేష్ ఆటోపై ఉల్లిపాయలు అమ్ముతుంటారు. మంగళవారం అతను ఉల్లిపాయలు అమ్ముతుండగా తోట ప్రసాద్, అతని బావమరిది, మాధవరపు యేసు అనే వ్యక్తులు తన భర్తతో గొడవకు దిగారని, అదే రోజు రాత్రి వారు ముగ్గురూ తమ ఇంటికి వచ్చి తన భర్తను ఇంటిలోంచి బయటకు లాగి కొట్టినట్లు భవాని ఫిర్యాదు చేసింది.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

రామచంద్రపురం రూరల్: మండలంలో 2021 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2022 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి హామీ పనులపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారి ఎం.మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని 25 పంచాయతీల్లో ఈ నెల 20 నుంచి 28 వరకూ తనిఖీలు చేసి గుర్తించిన అంశాలను వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 643 పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ పనుల్లో జరిగిన అవకతవకలను గుర్తించి రూ.68 వేలను రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ ఎస్.సత్యనారాయణ, ఎస్‌ఆర్‌పీ బి.దాసు, పంచాయతీరాజ్ ఏఈ యేసురాజు, ఈఓపీఆర్డీ ఎన్. షెలత్‌రాజు, ఏపీఓ జి. అరుణకుమారి, జేఈ కె.కనకలత, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

గ్రామాల్లో రామాలయాల్లో ఏర్పాటు పూర్తి


వెలంపాలెంలో రాములోరి కల్యాణానికి సిద్ధమైన వేదిక

రామచంద్రపురం రూరల్: రాములోరి కల్యాణానికి వేదికలు సిద్ధమయ్యాయి. ద్రాక్షారామ మార్కెట్టు, సూర్యా వీధి, తోటపేట, నరసాపురపుపేట, వెల్ల, వెలంపాలెం వేదపాఠశాల తదితర చోట్ల చలువ పందిళ్లు వేశారు. వెలంపాలెంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి, చంద్రశేఖరేంద్ర భారతీస్వామ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో పదమూడేళ్లుగా చేస్తున్న రాముల వారి కల్యాణం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని మార్కెట్‌లో వర్తక సంఘం ఆధ్వర్వంలో 1955 నుంచి సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మేడవరపు చింతామణి బ్రహ్మత్వంలో అప్పన ప్రసాద్, లక్ష్మీనిహారిక దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

సత్యవాడ గ్రామంలో..

కె.గంగవరం: ఏటా రాములవారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం సత్యవాడ గ్రామస్తుల ఆనవాయితీ. ఈ ఏడాది కూడా భారీ ఎత్తున రాముల వారి కల్యాణం నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని విధాల ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామంలోని మూడు ప్రధాన వీధులోను సీతారాముల వారి కల్యాణం కనుల పండువగా నిర్వహిస్తారు. వేదపండితుల ఆధ్వర్యంలో భద్రాచలం రాములవారి కల్యాణం జరిగే సమయంలోనే సత్యవాడలోని మూడు ప్రధాన వీధుల్లో కల్యాణం జరిపిస్తారు. కల్యాణం అనంతరం రాత్రికి జాతర మహోత్సవం జరుగుతుంది. గ్రామంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు ఆకట్టుకుంటున్నాయి. పామర్రు బీసీ కాలనీలో స్వామివారి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.20 కోట్లతో ప్రధాన డ్రైన్ల నిర్మాణం

- రూ.6కోట్లతో వాటర్ రీ సైకిలింగ్ ప్లాంట్
- కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు
- 19 అంశాలకు ఆమోదం


పట్టణంలోని అభివృద్ధి పనులపై డీఈ దుర్గా ప్రసాద్‌కు సూచనలు చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: పురపాలక పరిధిలో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు పట్టణ శివార్లలో రూ.6 కోట్లతో వాటర్ రీసైకిలింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ వెల్లడించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం సమావేశ మందిరంలో చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్‌ఆఫీషియో సభ్యునిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ పట్టణంలోని మొత్తం మురుగునీరు ప్రధాన డ్రైనేజీల ద్వారా వెల్ల రోడ్డులోని ప్రధాన కాలువ ద్వారా ప్రవహిస్తుందన్నారు. వెల్ల సమీపంలోని వాటర్ రీసైకిలింగ్ ప్లాంట్ ద్వారా మురుగునీటిని మంచినీటిగా తయారు చేసి పంట పొలాలకు సరఫరా చేసేలా ప్లాంట్‌ను రూ. 20 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. పట్టణంలోని ప్రధాన మురుగు కాలువలను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి వేణు తెలిపారు. దీనికి సంబంధించి పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ మురుగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే వార్డుల్లో జరుగుతున్న పైపులైన్ పనులు, రైతు బజార్ టెండర్లు, మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రణాళికల తయారీ తదితర వాటిపై మంత్రి మాట్లాడారు.

సమస్యల పరిష్కారం దిశగా..

పట్టణంలోని ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లను సీసీ రోడ్లుగా మార్చామన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలతో పాటుగా స్థానిక ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిష్కరించామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే నిధులు మంజూరు చేశామని మంత్రి వేణు వెల్లడించారు. సమావేశంలో మొత్తం 19 అంశాల అజెండాను సీనియర్ అసిస్టెంట్ కె.వేణుగోపాలరావు కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు చదివి వినిపించగా వాటిని ఏకగ్రీవంగా కౌన్సిలర్లు ఆమోదించారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు వాద్రేవు సాయిప్రసాద్, పెంటపాటి శ్రీదేవి, కేతా శ్రీను, పోతంశెట్టి వెంకట శ్యామల, తోట అమ్మాజీ, కేతా సుజాత కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


అంగరలో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సమాజంలో మహిళ గొప్ప ఆర్థిక శక్తిగా ఎదగాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంగరలో బుధవారం వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మహిళా సంఘాల రుణ మాఫీ సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పెదిరెడ్డి శేషారత్నం, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడారు. మండలంలో 1,504 సంఘాలకు చెందిన 14,176 మంది సభ్యులకు రూ.11.94 కోట్లు జమ అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట తనయుడు పృథ్వీరాజ్, నల్లూరు సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ గంగామళ్ళ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.